## గణనాధుని రథోత్సవం ట్రైల్‌రన్



కాణిపాకం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారి దేవస్థానంలో శనివారం రథోత్సవం ట్రైల్‌రన్ నిర్వహించారు. దేవస్థానంలో ఈనెల 18 నుండి స్వామివారి వార్షిక బ్ర హోత్సవాలు జరుగనున్నాయి. ఈమేరకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 25న స్వామివారికి రథోత్సవం జరుగనుండి ఈమేరకు స్వామివారు ఊరేగే రథంకు గత నాలుగు రోజుల క్రితం ఇంజనీరింగ్ అధికారులు మరమ్మత్తులు చేపట్టి పూర్తి చేశారు. దీనితో రథం ఫిట్‌నెస్ కోసం ట్రైల్ రన్‌ను శనివారం నిర్వహించారు. రథంకు పూజలు నిర్వహించిన అనంతరం సుమారు 200 అడుగుల వరకు ట్రైల్ రన్ నిర్వహించి ఫిట్‌నెస్‌ను పరీక్షించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటేశు, ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ ఎస్వీ.కృష్ణారెడ్డి, సూపరెండెంట్ కోదండపాణి, ఆలయ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త


## కల్యాణ వెంకన్నకు బంగారు చక్రహస్తం వితరణ

చంద్రగిరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో ఉత్సవమూర్తికి శనివారం పీలేరుకు చెందిన జడ్పీటిసి రత్నా శేఖర్ రెడ్డి బంగారు చక్రహస్తం వితరణ చేసినట్లు ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 225 గ్రాముల బంగారం రూ.16.82 లక్షల వ్యయంతో తయారు చేయించినట్లు తెలిపారు. అనంతరం దాత కుటుంబ సభ్యులకు స్వామి వారి దర్శన ఏర్పాట్లు గావించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ యం.గోపినాధ్, సూపరింటెండెంట్ తెనేపల్లి వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు నారాయణాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# 'వేడుకొందామా...వేంకటనాధుడి నామం'



### -దేదీప్యమానం....తిరుమలగిరులు





ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

ఆపదమొక్కులవాడుగా..అనాథరక్షకుడుగా అడుగడుగునా భక్తులకు తోడునీడలా కాపాడుతున్న ఏడుకొండల శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థం మనమంతా తిరుమలకు వస్తుంటాము. అయితే ఆలయంలోనికి చేరడం ఆలస్యం...అప్పటి వరకు కొన్నిగంటలుగంటలు నిరీక్షణలు...క్యూలైన్లలో కష్టాలు,తోపులాటలు అన్నీ ఒక్కసారిగా మరచిపోతాం.ఆ దివ్యమంగళ విగ్రహరూపాన్ని దర్శించినంతమాత్రాన భక్తుల్లో చెప్పలేని ఆనందానుభూతి పొందుతుంటారు. ఇప్పుడు దేవదేవుడు సాలకట్లవార్షిక బ్రహ్మోత్సవాలకు తిరుమలగిరులు ఆకట్టుకునేలా విద్యుద్దీపకాంతులు విరాజిల్లుతున్నాయి. దేదీప్యమానంగా ఉన్న వెలుగులతో ఏడుకొండలు కలియుగవైకుంఠాన్ని తలపిస్తోంది. స్వాగత ఆర్చిలు, దేవతామూర్తుల ప్రతిమలు, దశావతారాలు తదితరాలు ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకే హైలైట్ .



### ధ్వజారోహణానికి
## దర్భచాప, తాడు సిద్ధం
### -ఊరేగింపుగా ఆలయంలోపల పూజలు

తిరుమల,సెప్టెంబర్ 16ప్రభాతవార్తప్రతినిధి:

శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు ఆరంభసూచకంగా సోమవారం సాయంత్రం జరిగే ధ్వజారోహణ ఘట్టానికి అవసరమైన దర్భచాప, తాడు టిటిడి అటవీశాఖ అధికారులు, సిబ్బంది సిద్ధం చేశారు. ఎంతో పవిత్రంగా సేకరించే దీన్ని ఏర్పేడు అటవీప్రాంతంలో సేకరించి 22 అడుగుల పొడవు, ఏడున్నర అడుగుల వెడల్పుతో దర్భచాప, 200 అడగుల పొడవు తాడు తీసుకువచ్చి శనివారం మధ్యాహ్నం ఆలయంలోనికి చేర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, అటవీశాఖ డిసిఎఫ్ శ్రీనివాసులు, అటవీసిబ్బంది పాల్గొన్నారు.

### అర్హులైన ప్రతి ఒక్కరికి
# సంక్షేమ ఫలాలు

**- 4వ విడత వైఎస్ఆర్ కాపునేస్తం కింద**

**7,091 లబ్దిదారులకు రూ.10.65 కోట్లు లబ్ది : - ఎంపీ రెడ్డప్ప**



కాపునేస్తం నిధుల విడుదల కార్యక్రమంలో వర్చువల్ విధానంలో సిఎం కార్యక్రమానికి హాజరైన ఎంపీ రెడ్డప్ప, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెసి శ్రీనివాసులు తదితరులు.

చిత్తూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీ రెడ్డప్ప పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు నుండి శనివారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 4వ విడత కాపునేస్తం పథకం కింద అర్హులైన కాపు, తెలగ, ఒంటరి, బలిజ సామాజిక వర్గానికి చెందిన 45-60 సంవత్సరాల వయస్సు మహిళలు ఒకొక్కరికి 15 వేల రూపాయలు చొప్పున కంప్యూటర్ బటన్ నొక్కి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. జిల్లా సచివాలయం నుండి వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమంలో ఎంపీ రెడ్డప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, మేయర్ అముద, స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజినల్ ఛైర్‌పర్సన్ శైలజారెడ్డి, జడ్పీ వైస్ ఛైర్మన్ రమ్య తదితరులు పాల్గొన్నారు. ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం మహిళా సాధికారితే లక్ష్యంగా, వారిని ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా అభివృద్ధి చేయడానికి చర్యలు చేపట్టారన్నారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం జగన్మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల్లో కాపునేస్తం ద్వారా అర్హులైన లబ్దిదారులకు 75వేల రూపాయలు అందించాలని నిర్ణయించారని, ఈ మేరకు ఇప్పటికే 4విడతల్లో 60 వేల రూపాయల లబ్ది చేకూరిందన్నారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ 4వ విడత కాపునేస్తంలో భాగంగా జిల్లాలో 7,091 మంది లబ్దిదారులకు 10.65 కోట్ల రూపాయలు వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమచేయడం జరిగిందన్నారు.

### సెంట్రల్ లైటింగ్‌కి
## కోటి 41 లక్షల రూపాయల నిధులు



**- ఎంపీ గురుమూర్తి**

వెంకటగిరి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త: వెంకటగిరి పట్టణం మీదుగా వెళుతున్న జాతీయ రహదారి 565పై 2.450 కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసేందుకు నేషనల్ హైవే అథారిటీస్ టెండర్లు ఆహ్వానించింది. తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ప్రత్యేక శ్రద్ధ, కృషితో రూ.1.41 కోట్ల నిధులను వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో గల జాతీయ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ అనుమతులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా కి.మీ. 480.690 నుండి కి.మీ.483.140 వరకు న్యూ మీడియన్ హైవే లైటింగ్ కోసం నిధులు మంజూరు చేస్తూ నేషనల్ హైవే స్ అథారిటీ ఆఫ్ ఇండియా రీజినల్ ఆఫీసర్ పనులు చేపట్టేందుకు టెండర్లు ఆహ్వానించారు. ఇదివరకే వెంకటగిరి పట్టణంలో ఎంపీ మద్దిల గురుమూర్తి తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి కోటి రూపాయలు మంజూరు చేసి ఎల్‌ఈడీ కాంతులు నింపిన విషయం విదితమే. ఈ సందర్భంగా ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ స్థానిక నియోజకవర్గ ఇన్‌చార్జ్, వైసీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచన మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సహకారంతో వెంకటగిరి మున్సిపాలిటీలో ఈ రహదారిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు పలు మార్లు కేంద్రమంత్రి గడ్కరీకి విన్నవించామన్నారు. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుతో పాటు పట్టణ సుందరీకరణతో పాటు రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని ఎంపీ తెలిపారు. ప్రస్తుతం ఈ పనులు చేపట్టేందుకు సహకరించిన కేంద్రమంత్రి గడ్కరీకి ఎంపీ గురుమూర్తి ధన్యవాదాలు తెలియజేశారు.

# ముఖ్యమంత్రి రాక సందర్భంగా ముందస్తు భద్రత



రేణిగుంట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సెప్టెంబరు 18,19 తేదీల్లో తిరుపతి, తిరుమల పర్యటనలో భాగంగా జిల్లా రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టింది.తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు సందర్భంగా శ్రీవారికి పట్టు వస్త్రాలుసమర్పించడం, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లి దర్శనం, తిరుపతిలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి పాల్గొంటున్న నేపథ్యంలో చిన్న లోపాలకు కూడదని జిల్లా జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ సూచించారు. ముఖ్య వ ంత్రి పర్యటన దృష్ట్యా రేణిగుంట విమానాశ్రయంలో అధికారులుచేపట్టాల్సిన విధులపై జాయింట్ కలెక్టర్ బాలాజీ, జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డితో సమీక్షించి పలు సూచనలు చేశారు. జేసీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి 18వ తేదీ రేణిగుంట విమానాశ్రయం చేరుకుని అక్కడి నుంచి బయలుదేరి శ్రీనివాస సేతు ప్రారంభోత్సవం, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నూతన హాస్టల్ భవనాల ప్రారంభ శిలాఫలకం ఆవిష్కరణ, టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు కేటాయింపు పత్రాల పంపిణీ కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం తాతయ్యగుంట గంగమ్మ తల్లి గుడి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. ఆపై తిరుమల చేరుకుని వకుళమాతఅతిథి గృహం, రచన అతిథి గృమాలను ప్రారంభించి శ్రీ పద్మావతి అతిథి గృహం చేరుకుంటారు. అటు పిమ్మట బేడి ఆంజనేయస్వామి దర్శనం చేసుకుని శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామివారిని దర్శించుకుంటారు. టీటీడీ క్యాలెండర్ 2024ను ఆవిష్కరించి, పెద్ద శేష వాహనసేవలోపాల్గొని శ్రీ పద్మావతి అతిథి గృహంలో రాత్రి బస చేయనున్నారన్నారు. 19 తేదీ ఉదయం మరో మారు తిరుమల శ్రీవారిని దర్శించుకుని తిరుమల నుంచి బయలుదేరి రేణిగుంట విమానాశ్రయం చేరుకుని గంటలకు ఓర్వకల్ విమానాశ్రయానికి బయలుదేరి వెళ్తారన్నారు. భద్రతా ఏర్పాట్లు పగడ్బందీగాఉండాలని సూచించారు. వైద్యశాఖ స్పెషలిస్టు డాక్టర్లు, అంబులెన్స్, సేఫ్ రూమ్, అడ్వాన్స్ లైఫ్ సపోర్టు అంబులెన్స్, ఫైర్ అధికారులు ఫైర్ సేఫ్టీ చర్యలు, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ బందోబస్తు పటిష్టంగా ఉండాలని విధులు కేటాయించిన పోలీసు అధికారులకు, పోలీసులకు భద్రతపై హెచ్చరించారు. ముఖ్యమంత్రి పర్యటన కొనసాగే రహదారులను, ప్రదేశాలను పూర్తి స్థాయిలో జేసీ, ఎస్పీలు, జేఈవో టీటీడీ వీరబ్రహ్మం, తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరితలతో కలసి పరిశీలించి ఇంకొకసారి సాయంత్రం కలెక్టరేట్‌లో విధులు కేటాయించిన అధికారులకు పలు సూచనలు చేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారి పెంచల కిషోర్, ఎస్టీసీ కోదండ రామిరెడ్డి, ఆర్డీవోలు కనక నరసారెడ్డి, రామారావు, ఎయిర్‌పోర్టు సీఎస్‌వో రాజశేఖర్‌రెడ్డి, ఏఎస్పీలు కులశేఖర్, డీఎస్పీలు భవ్యకిషోర్, గిరిధర్, రవీంద్రరెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారి చెన్నయ్య, డీఎంహెచ్‌వో శ్రీహరి, జిల్లా రోడ్డు భవనాల అధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, ఇన్‌స్పెక్టర్ రెడ్డెప్పరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### పసుపు దుస్తులు ధరించి...
## గోవింద నామాలతో భజనలు

**చంద్రబాబుకు గోవిందుని ఆశీస్సులుండాలి : టిడిపి నేతల ప్రార్థనలు**



తిరుపతి,సెప్టెంబర్ 16ప్రభాతవార్త:

వైసిపి ప్రభుత్వం ,సిఎం జగన్ కుట్రతో...కక్షపూరితంగా ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడును అరెస్టు చేసి జైలుకు పంపారని, దీన్ని నిరసిస్తూ టిడిపి నేతలు రిలేనిరాహారదీక్షలు చేపట్టారు. ఈ దీక్షల్లో భాగంగా శనివారం ఉదయం నగరపాలకసంస్థ పాత కార్యాలయం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు పసుపు దుస్తులు ధరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చంద్రబాబు విశ్వాసంతో కొలిచే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉండాలని, ఆయన ఈ కేసునుండి విముక్తులై జైలునుండి నిర్దోషిగా రావాలని వేడుకున్నారు. అనంతరం అలిపిరి పాదాల మండపం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. టిడిపి నేతలు ఎం.సుగుణమ్మ, నరసింహయాదవ్, సూరాసుధాకర్‌రెడ్డి, మబ్బు దేవనారాయణరెడ్డి, పుష్పావతియాదవ్, బుల్లెట్‌రమణ, ఆర్‌సి మునికృష్ణ, కంకణాల రజినీకాంత్‌నాయుడు, ఊకా విజయకుమార్, బ్యాంకు శాంతమ్మ, విజయలక్ష్మి, సింధుజ, వసంతమ్మ, మంజుల, కుమారి, దంపూరి రాజ్యలక్ష్మి, బిజి కృష్ణయాదవ్, దంపూరి భాస్కర్, జెబి శ్రీనివాసులు, వట్టికుంట శంకరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ద్రవిడ వర్సిటీలో ముగిసిన త్రీమెన్ కమిటీ విచారణ

**- భూములిచ్చిన రైతులు.. తాత్కాలిక ఉద్యోగుల సమస్యల ఆరా !!**

కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

ద్రవిడ భాషలు, సంస్కృతి పరిరక్షణకు ఏర్పాటైన ద్రవిడ విశ్వవిద్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ఆచార్య. రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్వర్యంలో నియమించిన త్రీమెన్ కమిటీ విచారణ శనివారం ముగిసింది. శనివారం ప్రధానంగా ద్రవిడ వర్సిటీలో పనిచేస్తున్న సుమారు 256మంది తాత్కాలిక ఉద్యోగులకు చెల్లించాల్సిన వేతనాలు, వర్సిటీ ఆర్థిక స్థితిగతులు, తాత్కాలిక ఉద్యోగుల కొనసాగింపు తదితర అంశాలపై విచారణ చేపట్టారని తెలిసింది. అదేవిధంగా ద్రవిడ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అగరం, కొత్తపల్లి, యామనూరు ప్రాంతాలకు చెందిన రైతులు కేటాయించిన భూములు, రైతుల గురించి సైతం ఆరా తీశారు. రైతులనుంచి పలు వివరాలు సేకరించారు.పలువురు రైతులు తమ కుటుంబాలు వర్సిటీ ఏర్పాటుకు భూములు ఇచ్చినా తమకు వర్సిటీలో కేటాయించిన ఉద్యోగాల విషయంలో న్యాయం జరగలేదని కమిటీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. మరో పక్క ద్రవిడ వర్సిటీ తాత్కాలిక ఉద్యోగులు సైతం తమవేతనాలకు సంబంధించి త్రీమెన్ కమిటీకి వినతిప త్రం అందించారు. ఆచార్య చంద్రశేఖర్‌రెడ్డి నేతృత్వంలోని త్రీమెన్ కమిటీ వర్సిటీ సమస్యలు, వ్యవహారాలపై త్వరలోనే ప్రభుత్వానికి, రాష్ట్ర ఉన్నత విద్యామండలికి పూర్తి స్థాయిలో నివేదిక అందించనుంది.

## బ్లాస్టింగ్ రాళ్లు తగిలి చిన్నారి మృతి



శాంతిపురం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

మండలంలోని కర్లగట్ట పంచాయతీ చీమనపల్లి వద్ద బిఎస్ఎన్ఎల్ టవర్ నిర్మాణం కోసం గుట్టను బ్లాస్టింగ్ చేయగా రాళ్లు మీదపడడంతో చైత్ర అనే బాలిక తీవ్రంగా గాయపడడంతో పిఇఎస్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. పరిస్థితి విషమించి ఆస్పత్రిలో శనివారం మృతిచెందింది. తల్లిదండ్రులు మంజునాథ్, రాజేశ్వరి కన్నీటిపర్యంతమయ్యారు.

### చంద్రబాబు అరెస్ట్‌కు
## జగన్ మూల్యం చెల్లించక తప్పదు..!

**టిడిపి నియోజకవర్గ ఇన్-చార్జ్ పులివర్తి నాని**

**4వ రోజున పోటెత్తిన ఆర్.సి పురం తెలుగుతమ్ముళ్ళు**




చంద్రగిరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తగిన మూల్యం చెల్లించకతప్పదని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎంఎల్ఏ అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. చంద్రబాబు అరెస్ట్‌ను నిరశిస్తూ శనివారం 4వ రోజున టవర్ క్లాక్ వద్ద రామచంద్రాపురం మండల టిడిపి అధ్యక్షుడు తిరుమల రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పోటెత్తిన తెలుగుతమ్ముళ్ళు బాబుతో నేను సైతం నిరాహారదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వీరికి తన సంఘీబావం ప్రకటించిన పులివర్తి నాని మాట్లాడుతూ 14 ఏళ్ళు ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజిత ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి చంద్రబాబు ఒక విజన్‌తో పనిచేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చినబాబు, జనార్ధన్ చౌదరి, నరశింహారెడ్డి, హరిప్రసాద్, గిరిబాబు, జెడి జగన్, సుబ్రమణ్యం యాదవ్, మధసూన్‌రెడ్డి, ధనంజయ రెడ్డి, వెదురుకుప్పం మండల టిడిపి నాయకుడు పులికంటి చంద్రశేఖర్ రెడ్డి (బాబు రెడ్డి) తదితరులు పాల్గొన్నారు.

**సాయంత్రం కొవ్వొత్తుల ప్రదర్శన**

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ, టిడిపి అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు టవర్ క్లాక్ వద్ద భారీ ఎత్తున కొవ్వొత్తున ప్రదర్శనతో నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో చీకటి పాలనకు చరమగీతం పాడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ, టిడిపి మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్‌భాషా, పట్టణ అధ్యక్షుడు కాపువీధి సునీల్, నాయకులు వీరంగారి రమేష్ రెడ్డి, సక్కుర్ ధనంజయ రెడ్డి, కన్నయ్య నాయుడు, పులికంటి మోహన్ రెడ్డి, తులసి రెడ్డి, మండలం లోకేష్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

# చవితికి సిద్ధమౌతున్న దక్షిణ కైలాసం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణం వినాయక చవితి సంబరాలకుసిద్దమౌతుంది. శ్రీకాళహస్తిలోని మూల మూలల్లోనూ, నాలుగుమాడావీధుల్లోనూ వినాయచవితి సంబరాలకు భారీ ఎత్తున వినాయక చవితి సంబరాలు నిర్వహించాలని నిర్వాహకులు నిర్ణయించారు. శ్రీకాళహస్తి పట్టణంలో హైదరాబాదు తరహాలో వినాయక చవితి సంబరాలు భక్తుల భాగస్వామ్యంతో నిర్వహించుటకు ఉత్సాహం చూపుతున్నారు.

**ఉత్సవాలకు ఎనలేని ప్రాధాన్యత:**

పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో పండగలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అంతేకాక పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయం భువుగా వెలసిన దివ్యక్షేత్రంలో దేవస్థానమే నెల నెలా ఒక్కొక్క ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ హిందూ పండగలకు సంబంధించి ఈ తరం వారికి అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా పట్టణ నడిబొడ్డులోని బేరివారి మండపం,పెండ్లి మండపం వద్ద ప్రత్యేక కమిటిలుగా ఏర్పడి యువకులు నాలుగుమాడావీధుల్లోని వ్యాపారస్తుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్నారు. చవితి సంబరాలు 5 నుంచి 11 రోజులు నిర్వహించటం ఆనవాయితిగా మారింది. అంతేకాక పట్టణంలోని సుమారు వంద చోట్ల వినాయక విగ్రహాల్ని ఏర్పాటు చేసి మూడు,ఐదు, ఏడు రోజులు సంబరాలు జరిపి నిమజ్జనం చేయటం జరుగుతుంది.

**దేవస్థానంచే సారె:**

వినాయక చవితి సందర్బంగా నాలుగుమాడావీధుల్లో వెలసిన నవసంధి వినాయక ఆలయాలకు శ్రీకాళహస్తీశ్వరాలయం నుంచి సారె అందించే సంప్రదాయం ఉంది. ఈ నేపథ్యంలో ఈ నెల 18న ఉదయం దేవస్థానం నుంచి సారె అందించుటకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆలయ ఇఒ కె వి సాగర్‌బాబు ప్రకటించారు. హిందువులకు మొదటి పండగ పిళ్ళారి పండుగ కాబట్టి యువకులు అనందోత్సాహాలతో నిర్వహించుటకు పరుగులు తీస్తున్నారు.



వినాయక విగ్రహాలకు రంగులు అద్దుతున్న దృశ్యం

## పెద్దపంజాణి మండల వైకాపా అధ్యక్షుడిగా బాగారెడ్డి.

పెద్దపంజాణి సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :



పెద్దపంజాణి మండల వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడిగా బాగారెడ్డిని నియమిస్తూ ఆపార్టీ అదిష్టానం ఉత్తర్వులుజారీ చేసింది.బాగరెడ్డి ఇదివరకు మూడుసార్లు మండల కన్వీనర్‌గా పనిచేశారు నాలగవసారి సైతం మండలపార్టీ అధ్యక్ష పగ్గాలు బాగారెడ్డికి అప్పగించారు.ఈ నేపథ్యంలో శనివారం మండల కన్వీనర్ బాగారెడ్డిని స్థానిక మండల కార్యాలయంలో పలువురు అధికారులు,నాయకులు, సర్పంచులు, ఎంపిటిసి లు,అభిమానులు ఘనంగా సత్కరించారు.ఈ సందర్బంగా కన్వీనర్ బాగారెడ్డి మాట్లాడుతూ మండలంలో పార్టీబలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని పేర్కొన్నారు.సిఎం జగనన్న సంక్షేమపథకాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్ళి వైకాపా గెలుపుకు చొరవ చూపుతామన్నారు.తనపై నమ్మకముంచి పదవి అప్పగించిన సిఎం వైఎస్.జగన్మోహన్ రెడ్డి,మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి,జెడ్పీచైర్మన్ శ్రీనివాసులు,పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ,ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## మండల స్థాయి క్రీడాజట్లు ఎంపిక

పెద్దపంజాణి సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :



మండలంలోని అప్పినపల్లి జెడ్పీహైస్కూలో శనివారం స్కూల్ గేమ్స్‌లో భాగంగా అండర్-14, అండర్- 17 క్రీడాపోటీలను నిర్వహించారు ఈ సందర్భంగా బాలబాలికలకు కబడి, కోకో, యోగా పోటీలు నిర్వహించారు.ప్రతిభచూపిన విద్యార్థులను మండలస్థాయి జట్లకు ఎంపికచేశారు.ఈ మండలస్థాయి జట్లుకు నియోజకవర్గస్థాయిలో పోటీల్లోపాల్గొంటాయని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించారు.కార్యక్రమంలో జెడ్పీటిసి సుష్మాబాగారెడ్డి,సర్పంచ్ సుజాత,ఎంపిటిసి చంద్రారెడ్డి,వైకాపానేత రాజారెడ్డి,పిఇటిలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రసాయనిక విగ్రహాలు వద్దు.. మట్టివిగ్రహాలు ముద్దు..

పెద్దపంజాణి సెప్టెంబర్ 16 ప్రభాతవార్త :



వినాయకచవితి సందర్బంగా వివిధ రసాయనాలతో రూపొందించే వినాయకుని విగ్రహాలు కాకుండా మట్టితో కూడిన విగ్రాహాలను ప్రతిష్టించి పూజలు చేయాలని హెచ్‌ఎం బాబూరెడ్డి కోరారు.శనివారం మండలంలోని నాగిరెడ్డిపల్లి యుపిస్కూల్‌లో సైన్సు ఉపాధ్యాయురాలు ఆధ్వర్యంలో పిల్లలచేత మట్టివినాయకుని విగ్రహాలను రూపొందించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.సైన్సు ఉపాధ్యాయురాలు మీనాక్షి మాట్లాడుతూ విషరసాయనాలతో కూడిన పిఓపి విగ్రహాలుకాకుండా మట్టితో రూపొందించిన వినాయక విగ్రహాలను పూజించి నిమజ్జనంచేయాలని పిలుపు నిచ్చారు.తద్వారా పర్యావరణం కాలుష్యం కాకుండా ఉంటుందని జలాలు సైతం కలుషితం కాకుండా ఉంటాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు అంజప్ప,మాధవన్,గంగాధర్,విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రబాబు జైలు నుండి విడుదల కోసం ప్రత్యేక పూజలు

ఐరాల, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు నుండి విడుదల కావాలని ఆకాంక్షిస్తూ మండలంలోని అక్కంచెరువుపల్లి సత్రం శివాలయంలో శనివారం ఆ పార్టీ అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండ్లపల్లి పంచాయతీ అక్కంచెరువుపల్లి సత్రం శివాలయంలో ఆ పార్టీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మొత్కూరు సోమశేఖర్‌నాయుడు, వెంకటేష్‌నాయుడు, టిడిపి, జనసేన నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జయచంద్రయ్య, ఆరుళ్, ప్రశాంత్, లోకయ్య, జలీల్‌భాష, పూల ప్రభాకర్, రవి, లవకుమార్, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుండి శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ క్షేత్రంలో ధ్యాన బ్రహ్మోత్సవాలు

తవణంపల్లి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

మండలంలోని అరగొండ-చిత్తూరు రహదారి సిద్ధంపల్లి వద్ద వెలసిన శ్రీ విఘ్నేశ్వర పిరమిడ్ శక్తి క్షేత్రంలో ఈ నెల 18 నుండి 28వ తేదీ వరకు ధ్యాన బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా పిరమిడ్ సొసైటీ, గ్లోబల్ స్పిరిట్యువల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఈ నెల 18న వినాయక విజయంపై ప్రవచనం, 19న ఋషి పంచమి ప్రవచనం, 20 నుండి 26వ తేదీ వరకు భవద్గీత సప్తాహం, 27న విష్ణు సహస్రనామ సోత్రం, భాగవతం సృష్టి రహస్యం, 28న కనకధార సోత్రం, ప్రవచనం వుంటుందన్నారు. అలాగే 11 రోజుల పాటు హైదరాబాదుకు చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ బ్రహ్మణ రత్నం మారం శివప్రసాద్ ఆధ్వర్యంలో ధ్యాన బ్రహ్మోత్సవాల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని గోపాలకృష్ణమూర్తి తెలిపారు

## మహాశక్తి పథకాలతో మహిళలకు చంద్రబాబు అండ

కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



మహాశక్తి పథకాలతో మహిళాలోకానికి తెదేపా అధినేత చంద్రబాబునాయుదు అండగా నిలుస్తారని తెలుగు మహిళ నేతలు పేర్కొన్నారు. మండలంలోని చెక్కునత్తం పంచాయతీ కూసూరు, కాళనూరు గ్రామాల్లో మహాశక్తి పథకాల ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 18-59 ఏళ్లలోపు మహిళలకు నెలకు రూ 1500లు, ఉచితంగా ఏటా మూడు గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, తల్లికి వందనం పేరిట ఇంట్లో చదివే ప్రతి పిల్లవాడికి రూ15వేల వంతున అందిస్తారన్నారు. కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధనకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తెలుగు మహిళ నేతలు స్వాతి, గగన, కళ, శరణ్య, రేవతి, మహిళలు పలువురు పాల్గొన్నారు.

## ప్రజాసంక్షేమం..అభివృద్ధి ప్రదాత సిఎం జగనన్న



- ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి ప్రదాత సిఎం జగనన్న అని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ నేతృత్వంలో శనివారం మున్సిపల్ పరిధి తంబిగానిపల్లిలో జరిగిన గడపగడపకు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రతి ఇల్లు తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సిఎం జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రతి పథకంలో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. దాదాపు 3.5లక్షల కోట్లకరూపాయలకు పైగా సంక్షేమ పథకాల రూపంలో పేదలకు లబ్ది కలిగించారన్నారు. మరోమారు జగనన్నను ప్రజలు గెలిపించాలని కుప్పం నుంచి తనకు ఎమ్మెల్యేగా అవకాశం కల్పిస్తే అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్,జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, ఇన్‌చార్జ్ సిపి మనోహర్, సలహాదారు ఆర్. శ్రీనివాసులు, మైనార్టీ సెల్ సర్దార్, గుడుపల్లె ఎంపిపి వరలక్ష్మి, మోహన్‌రాం, మురళి తదితరులు పాల్గొన్నారు.

## కుప్పంలో కొనసాగుతున్న తెదేపా నిరసన దీక్షలు

కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌ను ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద తెదేపా నేతలు, కార్యకర్తలు చేపట్టిన నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు అనసూయ నేతృత్వంలో తెలుగు మహిళలు దీక్షలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబునాయుడు కడిగిన ఆణిముత్యంలా బయటకు వస్తారన్నారు. మహిళలు ఈసారి చంద్రబాబుకు పట్టం కట్టడం ఖాయమన్నారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఆంజనేయరెడ్డి, మునస్వామి, వివిధ మండలాల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు కుప్పంలో ఎపి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ కార్యవర్గసమావేశం

కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

కుప్పంలోని బిసిఎన్ కళ్యాణ మండపంలో ఆదివారం ఎపి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ కార్యవర్గం సమావేశం, పిఆర్‌టియు ఉపాధ్యాయ సంఘం రాష్ట్రస్థాయి సమావేశం జరుగుతుందని జిల్లా ఎపిజిఇఎఫ్ కార్యదర్శి మల్లీశ్వరన్, పిఆర్‌టియు నేతలు వెంకటేషన్, దేవరాజు, సురేంద్ర తెలిపారు. ఈ సమావేశానికి ఎపిజిఇఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి. చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు గిరిప్రసాద్‌రెడ్డి హాజరవుతారన్నారు. సమావేశానికి అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు హాజరు కావాలని కోరారు.

## రథంపై ఒరిగిన విద్యుత్ స్థంభం..తప్పిన ప్రమాదం

**కుప్పం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త** మున్సిపల్ పరిధి ఎన్టీఆర్ కాలనీలో రోడ్డు పక్కన గల ఓ విద్యుత్ స్థంభం హఠాత్తుగా అటుగా వెళ్తున్న రథంపై ఒరిగిపోయింది. దీంతో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. అయితే ఈ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం తెలుసుకున్న రెస్కో అధికారులు సంఘటనా స్థలికి చేరుకుని విద్యుత్ స్థంభంకు మరమ్మత్తులు చేయించారు.

## ఆకట్టుకున్న ధర్మప్రచార వైభవోత్సవ సభ సాంస్కృతిక ప్రదర్శనలు

**కాణిపాకం, సెప్టెంబర్ 16 ప్రభాతవార :** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ, కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కాణిపాకం దేవస్థానం ప్రచారరథం ప్రారంభోత్సవం, ధర్మప్రచార వైభవోత్సవ సభ సందర్భంగా దేవస్థానం వద్ద ప్రత్యేక సాంస్కృతిక కళాప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. స్థానిక ఆస్థాన మండపంలో శనివారం కాణిపాకం దేవస్థానం ప్రచారథం ప్రారంభోత్సవం, ధర్మప్రచార వైభవోత్సవ సభ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులచే భరతనాట్యం,కూచిపూడి, కోలాటాలు, చెక్కభజనలు, హరికథలు, బుర్రకథలు వంటి పలు రకాల సాంస్కృతిక కళాప్రదర్శనలు నిర్వహించారు. ఈకళా ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. కళాకారు లకు దేవస్థానం తరపున ప్రశంసాపత్రాలను, జ్ఞాపికలను అందజేశారు. అలాగే ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఘనంగా అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం

పాలసముద్రం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



మండలంలోని తిరుమలరాజుపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెడ్మాస్టర్ దీనదయాళ్ మాట్లాడుతూ జీవరాశికి రక్షణ కవచంగా వున్న ఓజోన్ పొరను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందన్నారు. 1987 మాంట్రియాల్ ప్రోటోకాల్‌లో సెప్టెంబర్ 16ను అంతర్జాతీయ ఓజోన్ పొర సంరక్షణ దినంగా నిర్ధారించడంతో ఈ మేరకు ప్రతి ఏడాది ఈ రోజు ఈ దినోత్సవంను ఘనంగా నిర్వహించుకొంటున్నామన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ఓజోన్ సాంకేతికం కన్పించేలా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుణశేఖర్, వాసు, మురుగదాస్, ఉషారాణి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## 7 నెలలుగా వృధా అవుతున్న మంచినీరు

పాలసముద్రం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



పాలసముద్రం మండలం వనదుర్గాపురం పంచాయతీ హరిజనవాడ మంచినీటి పైపులైనులో గత ఏడు నెలలుగా పైపులైను డ్యామేజీ అయ్యి మంచినీరు వృధాగా పోతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఈ గ్రామంలోని దళితులు ఇటు పంచాయతీ కార్యదర్శి, అటు సర్పంచ్‌ల దృష్టికి గ్రామంలోని మంచినీటి సమస్యను తీసుకెళ్ళినప్పటికీ ఫలితం లేకపోయింది. వనదుర్గాపురం హరిజనవాడలో సుమారు 200 కుటుంబాలు నివాసం వుంటున్నాయి. ఈ గ్రామంకు పైపులైను ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుంది. గత ఏడు నెలల క్రితం గ్రామంకు సమీపంలో మంచినీటి పైపులైను మరమ్మత్తుకు గురికావడంతో అక్కడ లీకేజ్ ప్రారంభమైంది. ఇక్కడ ప్రారంభమైన లీకేజీ నీటిని ఎవరు అరికట్టడానికి చర్యలు తీసుకోకపోవడంతో ప్రక్కన వున్న పొలాల్లోకి నీరు వృధాగా వెళ్తుంది. ఈ పైనులైను ద్వారా రాత్రి, పగలు నీరు వృధా అవున్నప్పటికీ పంచాయతీ సర్పంచ్, కార్యర్శులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్తుల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## చవితి వేడుకలకు అనుమతి తప్పనిసరి

పాలసముద్రం, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

వినాయక చవితి వేడుకలను పోలీసుల అనుమతి తప్పనిసరి అని ఎస్ఐ ప్రసాద్ పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా విగ్రహాల కమిటీ సభ్యులు జాగ్రత్త వహించాలన్నారు. ఉత్సవాలకు మూడు రోజుల అనుమతి మాత్రమే వుంటుందని, ఉత్సవాల్లో ఎక్కడా డిజె లాంటి ఏర్పాట్లు చేపట్టకూడదని ఎస్ఐ స్పష్టం చేశారు. వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకల్లో నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకొంటామని ఎస్ఐ హెచ్చరించారు.

## 'దేశం' అధినేత కోసం పూజలు

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు జైలు జీవితం నుండి వెలుపలికి రావాలని ఆకాంక్షిస్తూ తెలుగుదేశం నాయకులు శనివారం కట్టమంచి కులందేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, మాజీ మేయర్ కఠారి హేమలత, తెలుగుదేశం జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ తదితరులు అమ్మవారికి కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేశారు. అలాగే చిత్తూరులోని అంజనేయస్వామి ఆలయం, శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, దుర్గమ్మ గుడిల్లో తెలుగుదేశం నాయకులు చంద్రబాబునాయుడుకు మంచి జరుగాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విజయం పాఠశాలలో ఘనంగా చవితి వేడుకలు

**చిత్తూరుటౌన్ సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:** చిత్తూరు సుందరరాజుపురంలోని విజయం ది స్కూల్ పాఠశాలలో శనివారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు విజయం విద్యా సంస్థల అధినేత డాక్టర్ తేజోమూర్తి, అకాడెమిక్ డైరెక్టర్ డాక్టర్ శైలజ తేజోమూర్తిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ తేజోమూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దైవభక్తితో దేవుళ్ళను పూజించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వైసీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:



వైసీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 1వ వార్డు బంగారుపేటలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమా న్ని నిర్వహించారు. ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఇంటింటికి వెళ్లి అడిగి తెలుసుకున్నారు. స్థానికులు చెప్పిన సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, వైస్‌ఛైర్మన్ బాలయ్య, వైసీపీ జిల్లా కార్యదర్శి చిట్టేటి హరికృష్ణ, పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, కౌన్సిలర్లు వహీదా, గోపాలకృష్ణ, కృష్ణమూర్తి, సుబ్బారావు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మండల కన్వీనర్‌గా కార్తీక్ రెడ్డి నియామకం

బాలాయపల్లి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:



మండల వైఎస్ఆర్‌సీపీ కన్వీనర్‌గా వెందోటి కార్తీక్‌రెడ్డిని నియమిస్తూ పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. రామ్‌కుమార్‌రెడ్డి తనపై ఉన్న నమ్మకంతో మండల పార్టీ కన్వీనర్‌గా బాధ్యతలు ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ గెలుపే లక్ష్యంగా పని చేస్తానని తెలిపారు.

## పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలి

- వైసీపీ జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త:

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సచివాలయ సిబ్బంది చర్యలు తీసుకోవాలని వైసీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి సూచించారు. వెంకటగిరిలోని నేదురుమల్లి భవనంలో సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. పట్టణంలోని వీదుల్లో చెత్తాచెదారం వేస్తే మున్సిపాలిటీ సిబ్బంది ద్వారా వెంటనే శుభ్రం చేయించాలని సూచించారు. వీధుల్లో చెత్తాచెదారం వేయరాదని ప్రజలకు అవగాహన కల్పించారు. తాగునీరు, విద్యుద్దీపాలు వంటి సమస్యలను సూక్ష్మ దృష్టితో గుర్తించాలన్నారు. అక్టోబరు 4, 5 తేదీల్లో గ్రామశక్తి పోలేరమ్మ జాతర జరుగుతున్న సందర్భంగా ముఖ్యంగా తాగునీటి సమస్యపై దృష్టి పెట్టాలన్నారు.కమిషనర్ వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ ఇందిరా క్రాంతి పదం ఏపిఎం వెంకట్రావు మృతి

వాకాడు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త



ఈ నెల 8 ఆటోను కారు ఢీ కొట్టిన ఘటనలో వైఎస్ఆర్ క్రాంతి పదం వాకాడు వెంకట్రావు తీవ్ర గాయాలతో ప్రమాదం జరగడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వెంకట్రావు భార్య పిల్లలు ఉన్నారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్త పరిచిన వారిలో సొసైటీ చైర్మన్ దామోదర్ రెడ్డి, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు అజిత్ కుమార్ రెడ్డి, సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు రౌతు రామకృష్ణ, మండల స్థాయి అధికారులు, వైఎస్ఆర్ ఇందిరా క్రాంతి పదం సిబ్బంది సంతాపం వ్యక్తపరిచారు.

## వినాయక విగ్రహాల ప్రతిష్ట అనుమతి తప్పనిసరి

- నాయుడుపేట డిఎస్పీ రాజగోపాల్‌రెడ్డి

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



వినాయక విగ్రహాలను ప్రతిష్టించి ఉత్సవాలు చేసుకునే వారికి అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని నాయుడుపేట డిఎస్పీ ఎం.రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఆయన విగ్రహాలు ప్రతిష్టించే నిర్వాహక కమిటీల వారితో మాట్లాడారు. విగ్రహాలు ప్రతిష్టించదలచుకున్న వారు పోలీసుల అనుమతి తీసుకోవాలని కోరారు. అనుమతితో పాటు ఎవరు ఉత్సవాలు నిర్వహిస్తున్నారో వారి పూర్తి వివరాలు నమోదు చేసి ఇవ్వాలన్నారు. రికార్డింగ్ డాన్సులు, పాటకచ్చేరిలు ఎటువంటి పరిస్థితుల్లోను అనుమతించేది లేదన్నారు. సాంప్రదాయ నృత్యాలకు మాత్రమే అనుమతి ఉంటుందని డిఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐ పి.రవిబాబు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డే

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట, షార్ వారి ఆధ్వర్యంలో ఇంజనీర్స్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శేషసాయి కల్యాణ మండపంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఇస్రో ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు. ఇస్రోకు చెందిన ఇంజనీర్లు ఎ.సయ్యద్ హమీద్, జి.గ్రహదురై, పిఎస్ రఘురామ్, ఆర్.సెంధిల్‌కుమార్, జి.రమేష్‌బాబు, సునీల్ తదితరులను సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఆదిశేషారెడ్డి, కోగిలి జయరామిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కోగిలి సురేష్‌రెడ్డి, లయన్స్ క్లబ్ కార్యదర్శి శ్రీనివాసులు జెట్టి, కోశాధికారి అప్పారావు తదితరులు పాల్గొన్నారు

## లయన్స్ క్లబ్‌చే వీధి వ్యాపారస్తులకు గొడుగుల పంపిణీ

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

శనివారం నగరంలోని గాంధీరోడ్డు,రైల్వే స్టేషన్,ఎస్వీ నగర్ తదితర ప్రాంతాల్లో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారస్తులకు తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బి.మునికృష్ణనాయుడు ఆధ్వర్యంలో ఉచితంగా గొడుగులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధి వ్యాపారమే జీవనాధారంగా బ్రతుకు బండిని లాగుతున్న చిరు వ్యాపారులు ఎండకు,వానకు ఇబ్బంది పడకూడదనే సదుద్దేశ్యంతో గొడుగులను పంపిణీ చేయడం జరిగిందన్నారు.సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందు వరుసలో ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి ముబారక్ బాషా,కోశాధికారి వినోద్ వెంకటాచలం,జిల్లా అదనపు కార్యదర్శి డా॥కె.రాజేంద్రప్రసాద్,సభ్యులు ఎమ్మార్.రాజా,మోహన్ సుందరం తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేటలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూలులో ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలు నిర్వహించారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల నుంచి 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో విజేతలకు ఎంఇఓ కె.శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు శేఖర్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మూర్తి, సంధ్యారాణి, మాధవీలత, సునీల్, చిరంజీవి, సుజన, మస్తాన్, జ్యోతి, సుజాత, వహీద మేరి, బాలసుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

## తడ మండల వైసీపీ అధ్యక్షునిగా జాలర్ల నేత ఆర్ముగం

తడ, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



తడ మండల వైసీపీ అధ్యక్షునిగా పులికాట్ జాలర్ల సంఘం నేత కెలివి ఆర్ముగం నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. ప్రస్తుతం ఆర్ముగం తడ పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నారు. గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాకు పులికాట్ జాలర్ల సంఘం నాయకునిగా వ్యవహరించారు. ప్రారంభంలో కాంగ్రెస్ పార్టీలో, అనంతరం వైసీపీలో చురుగ్గా పనిచేశారు. ఇదిలావుంటే ఇప్పటిదాకా మండల పార్టీ అధ్యక్షునిగా తడ మండలాధ్యక్షుడు కారూరుకు చెందిన కొళవి రఘురెడ్డి వ్యవహరించారు. ప్రస్తుతం ఆయనను తొలగించి ఆర్ముగంను ఎంపిక చేశారు. మండలంలో ఇటీవల పలు జాలర్ల కుప్పాలలో కొన్ని సంఘటనల వల్ల అధికార పార్టీకి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ అధ్యక్షునిగా పులికాట్ జాలర్ల నేతనే ఎంపిక చేయడం ఆసక్తికరంగా మారింది. జాలర్ల సమస్యలు పరిష్కరించి మళ్లీ అధికార పార్టీ వైపు వారిని తీసుకురావడానికి ఆర్ముగం ఎంతమేరకు కృషి చేస్తారన్నది వేచి చూడాల్సి ఉంది

## పేటలో ఇసుక అక్రమ రవాణా ...

పట్టించుకోని పోలీసులు-ఎస్ఈబి అధికారులు ...



నాయుడుపేట రూరల్ సెప్టెంబరు 16 ప్రభాతవార్త ;

నాయుడుపేట సమీపంలోని తుమ్మూరు స్వర్ణముఖినది నుండి కొంతమంది అక్రమార్కులు ఇసుకను అక్రమంగా తరళిస్తున్న సంబందిత పోలీసులు- ఎస్ఈబి అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. తుమ్మూరుకు చెందిన కొంతమంది అక్రమార్కులు గతకొంత కాలంనుండి రాత్రిసమయంలో ప్రభుత్వ నిభంధనలకు విరుద్దంగా స్వర్ణముఖినది నుండి అక్రమంగా ఇసుకను తరళిస్తున్నారు.నాయుడుపేటలో ఇసుకకు మంచి గిరాకి వుండటంతో అక్రమార్కుల అక్రమ వ్యాపారం మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది.ఈవిషయమై స్థానిక పోలీసులకు పలుధపాలుగా పిర్యాదుచేసిన వారుమాత్రం పట్టించుకోవడంలేదన్నారు.ఇప్పటికైనా జిల్లాఉన్నాతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆగ్రామ ప్రజలు కోరుతున్నారు.

## పెళ్లకూరు మండల వైసీపీ అధ్యక్షుడిగా ఒబ్బు వెంకటరత్నం

పెళ్లకూరు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



పెళ్లకూరు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఒబ్బు వెంకటరత్నం నియమితులయ్యారు. ఈ సందర్భంగా పెళ్లకూరు మండలం చెంబేడు గ్రామానికి చెందిన వెంకటరత్నం మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పార్టీ కోసం కష్టపడుతున్న వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని తెలిపారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఉమ్మడి నెల్లూరు జిల్లా ఎన్‌డిసిసిబి ఛైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిల ఆశీస్సులతో తనకు ఈ పదవి లభించిందని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడిగా ఎంపికైన వెంకటరత్నంను వైసీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా వైసీపీ ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి,ఎంపిపిపొలంరెడ్డిశేఖర్‌రెడ్డి,ఎల్లోమోహన్,రాంబాబు, మట్టేపాటి చెంగయ్య తదితరులు ఉన్నారు

## అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి

- సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేట, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త

నాయుడుపేట మండల పరిధిలోని గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. శనివారం నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆయా శాఖల అధికారులతో గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ కట్టా జ్యోతి, ఎంపిడిఓ శివప్రసాద్, తహశీల్దార్ రాజేంద్ర, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడం

జగన్మోహన్ రెడ్డికే సాధ్యం, ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి

చిల్లకూరు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త

రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. శనివారం చిల్లకూరు మండల పరిషత్ కార్యాలయంలో అధ్యక్షురాలు తుపాకుల వెంకటరమణ అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలో పలు గ్రామాల్లో త్రాగు నీటి సమస్య ఎక్కువగా ఉందని తన దృష్టికి తీసుకురావడం జరిగిందని సత్వరం పరిష్కరిస్తామన్నారు. అదే విధంగా రెవెన్యూలో కూడా భూ సమస్యలు ఎక్కువగా ఉందని వాటిని కూడా పరిష్కరిస్తామని రెవెన్యూ అధికారులకు తెలియజేసారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి చైర్మన్ ఓడూరు యమునమ్మ, వైస్ ఎంపిపి పోలిబోయిన చంగయ్య, తహశీల్దార్ కె. శ్రీనివాసులు, జడ్పిటిసి శ్రీనయ్య, చిల్లకూరు తిప్పగుంట పాల్యెం పిఏసిఎస్ చైర్మన్లు రాజనేని పిచ్చయ్యనాయుడు, చేవూరు నాగరాజు, ఏఓ శ్రీనివాస రావు, వివిధ శాఖల అధికారులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'హైబ్రిడ్ ఎలక్ట్రికల్ వెహికల్స్ బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టం'పై వర్క్‌షాప్

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



స్థానిక కరకంబాడి రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ నందు డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డిఎస్‌టి), జాతీయ సాంకేతిక సంస్థ సెర్బ్(ఎస్ఇఆర్‌బి) ఆర్థిక ప్రోత్సాహంతో,ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(ఈఈఈ) విభాగం ఆధ్వర్యంలో ఈనెల 11 నుండి 16 వరకు ఆరు రోజుల పాటు 'హైబ్రిడ్ ఎలక్ట్రికల్ వెహికల్స్ బ్యాటరీ మేనేజ్‌మెంట్ సిస్టం టెక్నిక్స్-చాలెన్జ్ అండ్ ఆపర్చునిటీస్' అనే అంశంపై వర్క్‌షాప్ ఘనంగా నిర్వహించారు.శనివారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బెంగళూరుకు చెందిన ఆర్ అండ్ డి ఎలక్ట్రిక్ పవర్ ట్రైన్ డివిజన్ డిప్యూటీ మేనేజర్ డా॥చెరుకూరి శ్రీహరి చరణ్ విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పలు ఆటోమొబైల్ కంపెనీలు ప్రస్తుతం హైబ్రిడ్ వాహనాలపై పరిశోధనలు మొదలెట్టాయన్నారు.ఇప్పుడు శాస్త్రవేత్తలు సంప్రదాయేతర ఇంధన వనరుల కోసం ప్రపంచ వ్యాప్తంగా తమ పరిశోధనలు తీవ్ర స్థాయిలో కొనసాగిస్తున్నారు.ఇందుకు ఆయా దేశాల ప్రభుత్వాలు కూడా మద్దతు తెలపడంతో పాటు,భారీ మొత్తంలో నిధులను కేటాయించడం జరుగుతోందన్నారు.ఎలక్ట్రిక్ వాహనం అనేది ప్రొపల్షన్ కోసం ఒకటి లేదా అంతకంటే ఎక్కువ ఎలక్ట్రిక్ మోటార్లను ఉపయోగించే వాహనం.ఇది కలెక్టర్ సిస్టం ద్వారా ఆధారితం,ఎక్స్‌ట్రా వెహిక్యులర్ మూలాల నుండి వచ్చే విద్యుత్తుతో లేదా బ్యాటరీ ద్వారా సయంప్రతిపత్తితో శక్తిని పొందుతుందన్నారు.ఎలక్ట్రిక్ రోడ్ వాహనాల్లో ఎలక్ట్రిక్ ప్యాసింజర్ కార్లు,బస్సులు,ట్రక్కులు,బగ్గీ,ట్రై సైకిళ్లు,మోటార్ సైకిళ్లు(స్కూటర్లు) వంటి వ్యక్తిగత రవాణా దారులు ఉన్నాయని ఆయన వివరించారు.అనంతరం ప్రిన్సిపాల్ డా॥ఎన్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వాహనాఇల ఇంజనీరింగ్ నిపుణుల ఆవశ్యకత భవిష్యత్తులో మెండుగా ఉంటుందన్నారు. లక్ట్రికల్ ఇంజనీరింగ్ పట్టభద్రులకు రానున్న కాలంలో ఈ రంగంలో మంచి అవకాశాలున్నాయని తెలిపారు.ఇటువంటి వర్క్‌షాప్‌లు అధ్యాపకులు మరియు విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఉపకరిస్తాయని అన్నారు.ఈ వర్క్‌షాప్‌కు రాష్ట్రంలోని వివిధ కళాశాలల నుండి 200 మందికి పైగా అధ్యాపకులు,విద్యార్థులు విచ్చేశారు.సమన్వయకర్తలుగా డా॥కె.కుమార్,ఎలక్ట్రికల్ విభాగాధిపతి డా॥లక్ష్మీదేవి వ్యవహరించిన వివిధ విభాగాధిపతులు,అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## రెజ్లింగ్ పోటీల్లో పల్లం విద్యార్థుల ప్రతిభ:

ఏర్పేడు(శ్రీకాళహస్తి రూరల్), సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



ఏర్పేడు మండలం పల్లం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రెజ్లింగ్ పోటీల్లో తమ ప్రతిభ చూపి విజయం సాధించారు. విద్యార్థులను శనివారం పాఠశాల అవరణలో సత్కరించారు. యాదమరిలో జరిగిన ఎస్.జి.ఎఫ్ రెజ్లింగ్ పోటీల్లో ఉమ్మడి చిత్తూరుజిల్లా నుంచి అండర్ 17 విభాగంలో బి.అరవింద్‌కుమార్, ఇ.మోహన్, కె.ముత్యాలబాబు, ఎస్.హేమంత్‌లు విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వడమాల పేటలో జరిగిన అండర్ 14 పోటీల్లో ఇదే పాఠశాల నుంచి పాల్గొన్న ఎస్.నాగరాజు, పి.మోహనాచారి, పి,చెంగారెడ్డిలో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు టి.ఆ నంద్ వివరించారు. విజయం సాధించిన విద్యార్థులను సత్కరించారు. విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఫిజికల్ డైరెక్టర్ పుష్పవాణి, వాణి, పాఠశాల చైర్మెన్ సుధాకర్‌రెడ్డి, కె.వి బాబు, మోహర్‌బాబా, రాజశేఖర్, పరమేశ్వరి, గుర్రప్ప, విజయశేఖర్, శ్రీరాములు, చలపతి, సుబ్రమణ్యం, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా బాలాలయ స్థాపన

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాలహస్తీశ్వరాలయానికి అనుబంధ ఆలయంగా ఉన్న మార్కండేయ తీర్ధం, శ్రీ కాశీవిశ్వనాథస్వామి (ఈటిసి కేంద్రం), దుర్గాంబ కొండ వద్ద వెలసిన శ్రీ దుర్గేశ్వర స్వామి, శివసుబ్రమణ్య జీర్ణోద్ధరణ పనులలో భాగంగా బాలాలయ పూజలును ఆలయ అర్చకులు స్వామినాథన్ గురుకుల్ ఆధ్వర్యంలో సంకల్ప పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారకశ్రీనివాసులు, ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, ఉపప్రధానార్చకులు దక్షిణామూర్తి రామ్నాధ్ గురుకుల్, మరియు దేవస్థానం అధికారులు ఏఈఓ లోకేష్‌రెడ్డి, టెంపుల్ సూపరింటెండెంట్ శ్రీహరి, ఇంజనీరింగ్ అధికారులు వేణుగోపాలరెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, సబ్‌టెంపుల్ ఇన్‌ఛార్జి యోగేష్, వేదపండితులు శ్రీనివాసశర్మ, సంగమేశ్వరశాస్త్రి, పరిచారకులు మోహన్‌శర్మ, మారుతీశర్మ, రాఖీశర్మ, చందుశర్మ తదితరులు పాల్గొన్నారు.

## సబ్‌జైలు నుంచి తెదేపా నాయకులు విడుదల

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



గత ఆదివారం స్థానిక ఆర్టీసి బస్టాండు వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తెలుగుదేశంపార్టీ నాయకులను టుటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో గత ఆదివారం సాయంత్రం పోలీసులు, తెలుగుదేశంపార్టీ నాయకులకు వాగ్వివాదం చోటుచేసుకోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఉన్న కుర్చీలు విరిగిపోయాయి. దీంతో సిసి కెమెరాల ద్వారా పరిశీలించిన పోలీసులు తెలుగుదేశంపార్టీనాయకులపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేశారు. మాజీ మార్కెట్‌కమిటీ రంగినేని చెంచయ్యనాయుడు, రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి, పట్టణప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, సుజిత్, వినయ్, కృష్ణమనాయుడు, కృష్ణయాదవ్, వి.బాలాజీలు ఉన్నారు. శనివారం వీరికి కోర్టు నుంచి బెయిల్ రావడంతో సబ్‌జైలు నుంచి విడుదల చేశారు. దీంతో వీరికి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి పూలమాల వేసి స్వాగతం పలికారు. అనంతర పట్టణంలో ర్యాలీగా వచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్, తిరుపతి పార్లమెంటు కోశాధికారి కంటా రమేష్, బిసి నాయకుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి పలువురు తెదేపా నేతలు పాల్గొన్నారు.

## చంద్రబాబుపై అవినీతి మరకలు అంటించడం ఎవరితరం కాదు

-కన్నావరం హరిబాబు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



టిడిపి అధినేత, తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడపై అవినీతి మరకలు అంటించడం కాదని ఆపార్టీ గాండ్ల తెలికుల బిసి సాధికార సమితి రాష్ట్ర సభ్యులు కన్నావరంహరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి చూస్తూంటే దొంగే దొంగా అన్నట్లు ఉందన్నారు. 14ఏళ్ల ముఖ్యమంత్రిగా మరో 15ఏళ్ళు ప్రధాన ప్రతిపక్ష నేతగా చంద్రబాబునాయుడు రాష్ట్రం కోసం కష్టపడి పనిచేశారన్నారు. చట్టాలను రక్షించాల్సిన పోలీసులే అర్ధరాత్రి ప్రజాస్వామ్యాన్ని, చట్టాలను కాలరాస్తూ చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారన్నారు. తాడేపల్లి ప్యాలెస్ పెద్దలను తృప్తి పరచడమే లక్ష్యంగా గంటల తరబడి చంద్రబాబును కోర్టులో హజరు పరచకుండా పోలీసులు కాలయాపన చేస్తున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో అవినీతి జరిగిందంటూ తప్పుడు కేసులు పెట్టి రాజకీయ కక్ష సాధించడం జగన్‌కే చెల్లిందన్నారు. రాజకీయాల్లో కక్ష్యసాధింపు దోరణులు ఉంటే తగదన్నారు. కోర్టు నుంచి చంద్రబాబునాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్నారు.

## జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించండి

సత్యవేడు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంపై మండల ప్రజలకు అవగాహన కల్పించాలని సత్యవేడు ఎంపిడివో చంద్రశేఖర్ కోరారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష ఆరోగ్య క్యాంపులు నిర్వహిస్తామన్నారు. ప్రజల ఆరోగ్య సమస్యలపై ఇప్పటికే వాలంటీర్లు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## గృహనిర్మాణ శాఖ గోడౌన్‌లో సిమెంట్ బస్తాలు ఛోరీ

సత్యవేడు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :

ప్రభుత్వ పక్కా ఇళ్ళ నిర్మాణాలకు కేటాయించిన 1000 బస్తాల సిమెంట్ ఛోరీకి గురైనట్లు సత్యవేడు గృహనిర్మాణ శాఖ ఏఈ వెంకటసుబ్బయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. గృహ నిర్మాణశాఖకు సంబంధించిన గోడౌన్‌లో నుంచి దుండగులు ఛోరీకి పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే సదరు గృహ నిర్మాణ శాఖ ఏఈ సిమెంట్ బస్తాలను బయట వ్యక్తులకు విక్రయించి, ఏమితెలియనట్లుగా పోలీసులకు ఫిర్యాదు చేశారని, పోలీసుల ధర్యాప్తులో వాస్తవాలు వెలుగుచూసినట్లు సమాఛారం. కాగా రాజకీయ ఒత్తిళ్ళు కారణంగా పోలీసులు గుట్టురట్టు కాకుండా వ్యవహరిస్తున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారు. గృహనిర్మాణ శాఖ గోడౌన్‌లో మాయమైన సిమెంట్ బస్తాల అంశంపై ఉన్నతాధికారులు ఏవిధంగా బాధ్యత వహిస్తారో వేచి చూడాల్సి ఉంది.

## ప్రజాధరణ ఓర్వలేకనే..చంద్రబాబుపై అక్రమకేసు

-సత్యవేడు తెదేపా ఇన్‌ఛార్జ్ డాక్టర్ హెలెన్

సత్యవేడు, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త :

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి రోజు రోజుకి పెరుగుతున్న ప్రజాధరణ చూసి ఓర్వలేకనే వైకాపా ప్రభుత్వం అక్రమ అరెస్టలకు పాల్పడిందని సత్యవేడు తెదేపా ఇన్‌ఛార్జ్ డాక్టర్ హెలెన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెదేపా జాతీయ అధ్యక్ష్యుడు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టను వ్యతిరేఖిస్తూ శనివారం స్థానిక గాంధీ కూడలి వద్ద మండల అధ్యక్ష్యుడు ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం కాగడాలతో నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగేళ్ళుగా రాష్ట్ర ప్రజలు సైకో పాలనలో విసిగిపోయి, వైసిపీ ప్రభుత్వాన్ని ఛీకోడుతున్నారని విమర్శించారు. ఈకార్యక్రమంలో తెదేపా, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పార్టీని మరింత బలోపేతం చేద్దాం

-బిజెపి నాయకులు

తిరుపతి, సెప్టెంబర్ 16ప్రభాతవార్త:



తిరుపతి జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రజలకు చేరువవుదామని బిజెపి నాయకులు అన్నారు. జిల్లా అధ్యక్షుడుగా నియమితులైన బెస్తచంద్రప్పను శనివారం సాయంత్రం బిజెపి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయనను తిరుపతి నాయకులు గుండాల గోపీనాధరెడ్డి, దయాకర్‌రెడ్డి, మునిసుబ్రమణ్యం, అక్కిపల్లి మునికృష్ణయ్యయాదవ్, రవిప్రసాద్, వరప్రసాద్ కలసి దుశ్శాలువ కప్పి పుష్పగుచ్చంతో అభినందించారు.

## బెయిల్‌పై విడుదలైన టిడిపి నేతలు

తిరుపతి, సెప్టెంబర్ 16ప్రభాతవార్త:



టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అరెస్టును నిరసిస్తూ సిఎం దిష్టిబొమ్మ దగ్ధంచేసిన కేసులో అరెస్టయి జైలుకెళ్లిన కార్యకర్తలు శనివారం బెయిల్‌పై విడుదలయ్యారు. సబ్‌జైలు నుండి బయటకు వచ్చిన ఆర్‌పి శ్రీనివాసులు, మహేశ్‌యాదవ్, మరో ముగ్గురుకి టిడిపి నేతలు స్వాగతం పలికారు,. న్యాయం కోసం పోరాటం ఆగదని అన్నారు.

## మీ ఇంటి స్థలాలకు నాది బాధ్యత

-టిటిడి విశ్రాంత ఉద్యోగులకు ఛైర్మన్ కరుణాకర్‌రెడ్డి హామీ

తిరుపతి, సెప్టెంబర్ 16ప్రభాతవార్త:



మీ ఇంటిస్థలాలకు నాది బాధ్యత. ఏ ఒక్కరినీ నిరాశపరచను, గతంలో నేను ఛైర్మన్‌గా ఉన్నపుడు మీకు ఇంటిస్థలాలు ఇప్పించాను, మళ్ళీ నేను మీకు ఇంటిస్థలాలు ఇప్పించాలని నిర్ణయం తీసుకున్నాను అని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి భరోసా నిచ్చారు. పద్మావతిపురంలోని తన నివాసంలో శనివారం సాయంత్రం టిటిడి విశ్రాంత ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు కలసి సీనియర్లకు ఇంటి స్థలాలు లేవని, రిటైర్డ్ అయినవారికి ఇవ్వరని ఆవేదనతో ఉన్న మీరందరికీ ఇంటి స్థలాలు ఇప్పిస్తానని తెలిపారు. ఇందుకోసం అదనంగా ఉన్న 250 ఎకరాలు భూమిని సిఎం జగన్ మంజూరుచేసేలా కలెక్టర్‌కు ఆదేశాలిచ్చారన్నారు. ఈ విషయంలో ఎలాంటి సందేహం వద్దని, వివాదాలు సృష్టించుకోకుండా సమస్య పరిష్కారం చూడాలని కోరారు.

## బిజెపి జిల్లా అధ్యక్షుడిగా బెస్త చంద్రప్ప బాధ్యతల స్వీకరణ

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



శనివారం స్థానిక కేశవాయనగుంటలోని బిజెపి కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడిగా బెస్త చంద్రప్ప మాజీ అధ్యక్షుడు ప్రస్తుత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్‌రెడ్డి నుండి అధికారికంగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ గత మూడేళ్లుగా పార్టీని ప్రతి ఇంటికీ తీసుకెళ్లడానికి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. కష్టపడి పనిచేసే వారికి ఈ పార్టీలో ఎప్పుడూ సముచిత స్థానం ఉంటుందన్నారు. అనంతరం నూతన జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప మాట్లాడుతూ తాను పార్టీలో చేరి కొంత కాలమైనా..తనపై నమ్మకముంచి జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి ధన్యవాదాలు చెబెతున్నానన్నారు. పార్టీ బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త నుండి సూచనలు, సలహాలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మునిసుబ్రహ్మణ్యం, మీడియా కో-ఆర్డినేటర్ కోలా ఆనంద్‌కుమార్, రాష్ట్ర అధికార ప్రతినిధులు భానుప్రకాష్‌రెడ్డి, సామంచి శ్రీనివాస్, రాటకొండ విశ్వనాథ్, డా॥శ్రీహరి, అజయ్‌కుమార్, డా॥నరేష్, మహిళా నాయకురాళ్లు పాల్గొని నూతన జిల్లా అధ్యక్షుడు చంద్రప్పను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## తిరుపతి హోటల్స్ అండ్ రెస్టారెంట్స్

నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని జయప్రదం చేయండి

-తిరుపతి అధ్యక్షుడు చిల్లీస్ అంజి పిలుపు

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



తిరుపతి హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ తిరుపతి నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అసోసియేషన్ అధ్యక్షుడు చిల్లీస్ అంజి, సెక్రటరీ నితిన్ చక్రవర్తి, ట్రెజరర్ శ్రీహరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అంజి మాట్లాడుతూ నేడు ఆదివారం సాయంత్రం 4 గంటలకు స్థానిక భీమాస్ రెసిడెన్సీ హోటల్లో జరిగే తిరుపతి హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర హోటల్స్ అండ్ రాస్టారెంట్స్ అసోసియేన్ అధ్యక్షుడు ఆర్‌వి స్వామి వెంకట్‌రెడ్డి కార్యవర్గం రానుందన్నారు. నూతన కార్యవర్గం ఎన్నుకున్న తరువాత ఏపి, తెలంగాణ రాష్ట్రాల్లోని హోటళ్లు మరియు రెస్టారెంట్ల సమస్యలపై చర్చిస్తామన్నారు. ప్రధానంగా హోటళ్లు, రెస్టారెంట్లను చిన్న పరిశ్రమలుగా ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. నిత్యం తిరుమల శ్రీవారి దర్శనార్థం వేలాది మంది తిరుపతికి వస్తున్నారు. వారందరికీ రుచికరమైన, పరిశుభ్రమైన భోజనం అందిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం రాత్రి 12 గంటల వరకు రెస్టారెంట్లను అందుబాటులో ఉంచడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వాలని ఆయన కోరారు.

## జాతీయ స్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థినిలు

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



ఈనెల 8 నుండి 11వ తేదీ వరకు హర్యానా రాష్ట్రం, రోహత్‌లో గ్రాప్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండయా ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి గ్రాప్లింగ్ కుస్తీ అండ్ 15 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున స్థానిక శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు సత్తా చాటారు. ఇందులో ఇంటర్ మొదటి సంవత్సరం(సిఇసి) చదువుతున్న డి.రిజ్వానా బంగారు పతకం, కె.పావని వెండి పతకం, పి.చైత్ర(హెచ్ఈసి) కాంస్య పతకాలను సాధించారు. ఈ సందర్భంగా వీరిని కళాశాల ప్రిన్సిపాల్ డా॥సి.భువనేశ్వరి అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రీడలనేవి చదువుకు పరోక్షంగా ఎంతో ఉపయోగపడుతాయని, ఆత్మవిశ్వాసాన్ని, ఆత్మగౌరవాన్ని పెంచుతాయన్నారు. వ్యూహాలు, లక్ష్యాలను, మరింత శక్తి, శ్రద్ధ, మానసిక సామర్థ్యాలను పెంచుతాయని తెలిపారు. మిగిలిన విద్యార్థినిలు కూడా క్రీడల్లో రాణించాలని, టిటిడి కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో అధ్యాపకురాలు డా॥ఎ.జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి కాపాడుతూ విఘ్నేశ్వరుని పూజించుకుందాం

**నగరి, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:** సంస్కృతి కాపాడుతూ విఘ్నేశ్వరుని పూజించుకుందామని సీఐ సురేష్ అన్నారు. వినాయకచవితి పండుగ వస్తున్న నేపథ్యంలో శనివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో అన్ని మతములవారితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతముల వారు అన్నదమ్ముల్లా కలసి ఉండడం మన భారతీయ సంస్కృతి అన్నారు. అది పండుగ సందర్భంగా చేసే చిన్న పొరపాట్ల వద్ద చెడిపోకూడదన్నారు. పండుగ ఏదైనా దానికి మతపరమైన ఆటంకాలు రాకూడదన్న ఉద్దేశంతోనే ఈ సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాజాకుళ్లాయప్ప, పోలీసులు పాల్గొన్నారు.

## దస్కూల్‌లో ముందస్తు వినాయకచవితి వేడుకలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



పట్టణంలోని ద స్కూల్‌లో శనివారం ముందస్తు వినాయకచవితి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ముఖ్యఅతిధులుగా కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె.పవార్, పివిఆర్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్‌రావు వి.పవార్‌లు హజరయ్యారు. ద స్కూల్ ఆవరణలో విఘ్నాలను తొలగించే బొజ్జలగణపయ్య విగ్రహాన్ని ప్రతిష్టించి అభిషేకం, అర్చన, నైవేద్యం సమర్పించారు. విద్యార్థులందరు భక్తి ప్రపత్తులతో స్వామివారిని ప్రార్ధించారు. అనంతరం సాయంత్రం ఉట్టి ఉత్సవ కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం విశాల, ఉపాధ్యాయబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పచ్చని చెట్లే ప్రగతికి మెట్లు

తొట్టంబేడు, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



పచ్చనిచెట్లే ప్రగతికి మెట్లు అని స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు జలగం.బాలమురళీ పిలుపునిచ్చారు. శనివారం పూడి గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా బాలమురళీ మాట్లాడుతూ మరియు గ్రామ పెద్దల సమక్షంలో కార్యక్రమాన్ని ప్రారంభించి మొక్కలను నాటారు. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ పచ్చని చెట్లే ప్రగతికి మెట్లని ప్రతి ఒక్కరు తమ పుట్టినరోజు నాడు మొక్కలను నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పనితో పాటు సుస్థిర ఆస్తులు సృష్టించాలి

డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్

ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్), సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 100రోజుల పనితోపాటు గ్రామాల్లో సుస్థిర ఆస్తులను సృష్టించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సి.వి.శ్రీనివాస్ ప్రసాద్ అన్నారు. ఏర్పేడు మండలం కొత్త వీరాపురం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పర్క్యులేషన్ పాండ్ పనులను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ సి.వి.శ్రీనివాస్ ప్రసాద్ తనిఖీ చేసి పలు సూచనలు చేయటం జరిగింది. పంచాయతీ లో జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పనులు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను పెంపొందించాలని భూములు కల్గిన ఉన్న ప్రతి షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తరగతుల, చిన్న, సన్నకారు రైతులు పండ్ల తోటల పెంపకం, పూల తోటల పెంపకం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టుకొని సంరక్షించుకుంటే వేతనాలు, మెటీరియల్‌పేమెంట్‌లు మూడు సంవత్సరాల పాటు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపారు. ఈకార్యక్రమాల్లో టెక్నికల్ అసిస్టెంట్ సాలి మనోహర్, అదనపు కార్యక్రమాల అధికారి అవిలాల దేవరి తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎఇకి పదోన్నతి: సత్కరించిన సిబ్బంది

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో జవాబుదారి తనంతో పని చేసే ఎఇ కె.లలితకు డిఇగా పదోన్నతి లభించింది. ఆమెను శనివారం మున్సిపల్ కార్యాలయంలో సత్కరించారు. శ్రీకాళహస్తి ఎఇగా లలిత 2019లో బాధ్యతలు స్వీకరించారు. ఆమె చేరిన తరువాత కరోనా కాలంలో విధులు నిర్వహించాల్సి వచ్చింది. పట్టణంలో జటిలంగా ఉన్న ఎస్‌డికె నగర్ సమస్యలను పరిష్కరించటంలో ఆమె చొరవ చూపారు. అలాగే పట్టణంలో అందంగా పూల కుండీలను ఏర్పాటు చేసారు. అంతేకాక అభివృద్ధి పనుల్లో ఎప్పటి కప్పుడు వార్డుల్లో సమస్యలను గుర్తించి గతుకుల రోడ్లకుఅతుకులు వేయింటంలోనూ, మురుగునీటి కాలువల నిర్మాణాలు, ఎస్‌డికె నగర్‌ను ముంచేస్తున్న వర్షపు నీటిని తరలించుటకు రూ.రెండుకోట్లతో రెండు ప్రాధాన కాలువలను నిర్మించి వరదనీటిని మళ్ళించి ఎస్‌డికె నగర్, చెంచులక్ష్మీకాలనీలకు ముప్పు లేకుండా చేసారు. ఆమెకు పదోన్నతి లభించటంతో కమిషనర్ ఎం.రమేష్‌బాబు, మేనేజర్ ఉమామహేశ్వరరావు, రెవెన్యూ ఆఫీసర్ పిఎంవి నారాయణరెడ్డి, అధికారులు సిబ్బంది ఆమెను అభినందించారు.

## సత్యకుమార్ జన్మదిన వేడుకలు

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త



భారతీయ జనతాపార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ జన్మదిన వేడుకలను శనివారం శ్రీకాళహస్తి ఇన్‌చార్జి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్ సారథ్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బేరివారి మండపం వద్ద సంబరాలు జరిపి కేక్‌లు కట్ చేయగా వృద్ధాశ్రమంలో నిరాదరణకు గురై ఉన్న వారికి దుస్తులు, పండ్లు అందించారు. ఈ కార్యక్రమాల్లో గరికపాటి రమేష్‌బాబు, సొట్ట కుమార్, కొండేటి గోపాల్, వేదం కృష్ణయ్య, లింగాబత్తిన గోపాల్, వీరాస్వామి ఆచారి, కోనేటి అయ్యప్ప, మద్దు వాసుయాదవ్, జి.సుబ్రమణ్యం, కన్నా వెంకటేశ్వర్లు, జివి అమర్‌నాథ్, ఇ.మోహన్‌రావు, పగడాల ప్రతాప్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

## అక్కా చెల్లెమ్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే వైఎస్ఆర్ కాపు నేస్తం లక్ష్యం

నగర మేయర్ డా. శిరీష

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 16, ప్రభాతవార్త



అక్కా చెల్లెమ్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైఎస్ఆర్ కాపు నేస్తం పథకాన్ని ప్రవేశ పెట్టారని నగర మేయర్ డా. శిరీష పేర్కొన్నారు. శనివారం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో ఏర్పాటు చేసిన బహిరంగ సభ వేదిక నుండి నాలుగవ విడత వైఎస్ఆర్ కాపు నేస్తం పథకం లబ్ధి మొత్తాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాలో జమ చేసే కార్యక్రమం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా కలెక్టరేట్ నుంచి తిరుపతి నగర మేయర్ శిరీష, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కోదండరామి రెడ్డి అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వీడియో కాన్ఫిరెన్స్ అనంతరం మేయర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాపు నేస్తం ద్వారా జిల్లాలో 8512 మంది బలిజ, తెలగ, ఒంటరీ సామాజిక వర్గానికి చెందిన మహిళలకు 12.76 కోట్ల రూపాయిలు నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమ చేశారని తెలిపారు. తిరుపతి జిల్లాలో 2020 - 2021 నుండి నాలుగు విడతలలో వైఎస్ఆర్ కాపు నేస్తం పతకం ద్వారా 30176 మందికి రూ. 45.26 కోట్లు లబ్ధి మొత్తాన్ని నేరుగా బటన్ నొక్కి మహిళల ఖాతాలోకి జమ చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అధికారులతో కలిసి అందజేసారు. ఈ కార్యక్రమంలోజిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ రెడ్డి, బిసి కార్పొరేషన్ ఏఈఓ బాబు రెడ్డి, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుంది

నింద్ర విద్యాశాఖాధికారి వసుమతి

నింద్ర, సెప్టెంబరు 16 ప్రభాతవార్త :

రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని నింద్ర విద్యాశాఖాధికారి వసుమతి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యస్‌జియఫ్ సెలక్షన్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల వల్ల మంచి ఆరోగ్యము, విద్యార్థులకు మంచి భవిషత్ వుంటుందని తెలిపారు. పాఠశాలలో అండర్ 14, అండర్ 17 బాలబాలికల పోటీలను ప్రారంబించినారు. ఈకార్యక్రమంలో మండల స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ సి.సుబ్రమణ్యం, పిడిలు జ్ఞానకుమార్, సుకుమార్, వహిదాబేగం, తదితరులు పాల్గొన్నారు.

## మామిడి చిగురు దశలో తేనెమంచు పురుగు

మండల ఉద్యానవన అధికారిణి ఎస్.శైలజ

చంద్రగిరి, సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:



మామిడి చిగురు దశలో తేనెమంచు పురుగు (రసం పీల్చే పురుగు) ఎక్కువగా ఆశించడం జరుగుతుందని మండల ఉద్యానవన అధికారిణి ఎస్.శైలజ అన్నారు. మండల పరిధి లోని మొండికాల్వ, పనపాకం, భీమవరం, ఏ.రంగంపేట, శేషాపురంలోని మామిడి తోటలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తేనెమంచు పురుగు కారణంగా మామిడి పూత సరైన సమయంలో వచ్చే అవకాశం తక్కువగా వుంటుందన్నారు. ఈ తేనెమంచు పురుగు ఉధృతి అధికంగా వున్నప్పుడు పురుగు నివారణకు మోనోక్రోటోఫాస్ పురుగు మందు 3 మి.లీ., డైథేన్ ఎం 45 తెగులు మందు 2.5 గ్రా., అజాడి రక్టిన్ 10000 పిపిఎం 1 మి.లీ. జిగురు 0.5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి చెట్టు కాండము, కొమ్మలు, చిగుర్లు బాగా తడిచే విధంగా ఒకసారి పిచికారి చేసుకోవాలన్నారు. తద్వారా పూత దశలో వచ్చే తేనెమంచు పురుగు ఉధృతిని అరికట్టే అవకాశం ఎక్కువగా వుంటుందన్నారు.

## వినాయక మండపాలు ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలి - ఎస్ఐ

పుత్తూరురూరల్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:

పుత్తూరు మండలంలో, పట్టణంలో వినాయక మండపాలు ఏర్పాటుకు పోలీస్‌స్టేషన్‌లో తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీసభ్యులుగా ఏర్పడి కమిటీ వివరాలను పుత్తూరు పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని ఆయన తెలిపారు. పబ్లిక్ ప్రదేశాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసే వారు పుత్తూరు మున్సిపాలిటీ కమిషనర్, గ్రామపంచాయతీ వారి అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద జరిగే సంఘటనలకు కమిటీ నిర్వాహకులు బాధ్యత వహించాలని, డీజే సౌండ్ సిస్టమ్‌కు, డాన్స్ ప్రోగ్రాంలకు అనుమతి లేదని, నిర్దేశించిన సమయంలో మాత్రమే సౌండ్ సిస్టమ్ సమయంలో మాత్రమే సౌండ్ సిస్టమ్ వాడుకోవాలన్నారు. ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

## పుత్తూరులో వైభవంగా శ్రీవారి గొడుగుల ఊరేగింపు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం శ్రీవారి గొడుగులు, పాదకలు ఊరేగింపు కార్యక్రమం వైభవంగా సాగింది. పట్టణ పరిధిలోని ఎల్ఐసీ వద్ద కన్యపూజ, శ్రీ వెంకటేశ్వరస్వామి పూజ కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం భజనలు, బ్యాండు మేళాతాళాల నడుమ ఆర్టీసీ బస్టాండ్, కార్వేటినగరం రోడ్డు, కాపువీధి, బజారు వీధి మీదుగా శ్రీ వల్లిదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వరకు ఊరేగింపు జరిగింది. అక్కడ ప్రసాద వితరణ చేశారు. అనంతరం వడమాలపేట మీదుగా తిరుమలకు బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు విశ్వహిందూ పరిషత్ సంఘ నాయకులు రామన్, నాగరాజు, కేశవరాజు, రాఘవులు, సుందరమూర్తి, పుత్తూరు విశ్వ హిందూ పరిషత్ నాయకులు పేట బాలకృష్ణారెడ్డి, మేకల సుబ్రహ్మణ్యం, నిషిధ, సురేంద్రరాజు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి దశలో పదో తరగతి కీలకం - తులసిరాంరెడ్డి

రేణిగుంట, సెప్టెంబరు 16 ప్రభాతవార్త:

విద్యార్థి దశలో పదో తరగతి చాలా కీలకమైనదని ప్రగతి కో-ఆర్డినేటర్ తులసిరాంరెడ్డి అన్నారు.




రేణిగుంట విమానాశ్రయ సమీపంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శనివారం ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్‌పై మార్గదర్శక కార్యక్రమం జరిగింది. కో-ఆర్డినేటర్ తులసిరాం అనేక విషయాలను విద్యార్థులకు వివరించారు. పదో తరగతి తరువాత విద్యార్థులు ఎలాంటి విద్యను అభ్యసించాలో బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. తీసుకునే నిర్ణయమే భవిష్యత్‌కు పునాది లాంటిదన్నారు. ఏ రంగంలో రాణించగలమో అందుకు సంబంధించిన కోర్సులు ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ హరిబాబు, ప్రగతి మండల కో-ఆర్డినేటర్ జయలక్ష్మి, పాఠశాల బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ విద్యార్థులు శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

తిరుపతిరూరల్, సెప్టెంబర్16 ప్రభాతవార్త:

వ్యవసాయ విద్యను అభ్యసించే విద్యార్థులు శాస్త్ర సాంకేతిక తను అందిపుచ్చుకోవాలని ఆచార్య ఎన్జీ



రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ బోర్డ్ ఆఫ్ మేనేజ్మెంట్ సభ్యులు డాక్టర్ ఎం.మల్లిఖార్జునరెడ్డి, బి.మురళీధర్‌రెడ్డి, బి.శ్రీనివాసు లరెడ్డిలు సూచించారు. వర్శిటీ పాలకమండలి సభ్యులు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని వివిధ విభాగాలను సందర్శించి, పలు సలహాలు, సూచనలు చేసారు. అనంతరం శాస్త్రవేత్తలు, నాన్-టీచింగ్ సిబ్బందితో సమావేశమయ్యారు. బోర్డు సభ్యులు మాట్లాడుతూ మేము అందరం కూడా ఇదే విశ్వవిద్యాలయం నుండే పట్టభద్రులైనట్లు తెలిపారు. వ్యవసాయ విద్యార్థులు శాస్త్ర సాంకేతికతను అందిపుచ్చుకుని ముందుకు సాగాలన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో మౌళిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి.రమణ, శాస్త్రవేత్తలు, నాన్-టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాస్ట్ అకౌంటెంట్స్ ఛాప్టర్ చైర్మన్‌గా డా॥పార్థసారథి

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 16 ప్రభాతవార్త:

శనివారం జరిగిన కాస్ట్ అకౌంటెంట్స్ ఛాప్టర్ కార్యవర్గ సమావేశంలో కాస్ట్ అకౌంటెంట్స్ ఛాప్టర్ చైర్మన్‌గా డా॥అల్ల పార్థసారథిని ఎన్నుకున్నారు. అలాగే వైస్ చైర్మన్‌గా వి.గురప్పనాయుడు, సెక్రటరీగా కె.పూర్ణచంద్రరావు, జాయింట్ సెక్రటరీగా ముస్తాక్ షేక్, ట్రెజరర్‌గా సి.చైతన్యకుమార్, జాయింట్ ట్రెజరర్‌గా కె.రాధారాణిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

